
సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం । 7 । మే । 2025



శోభాయమానం

వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలకు ద్వారకాతిరుమల సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయాన్ని, పరిసరాలను శోభాయమానంగా అలంకరించారు. 8లో ▸



జీతాలు అందక విలవిల

రెండు నెలలుగా జీతాలు లేక ట్రిపుల్ ఐటీల్లోని కాంట్రాక్టు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. మార్చి, ఏప్రిల్ వేతనాలు రాకపోవడంతో సతమతమవుతున్నారు. 8లో ▸



ప్రశాంతంగా ఏపీ ఈ సెట్

పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలోకి అవకాశం కల్పించే ఏపీ ఈ సెట్ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రశాంతంగా జరిగింది. 8లో ▸

పేరుకే కూటమి పెత్తనం టీడీపీదే

పేరుకే కూటమి ప్రభుత్వం.. పెత్తనమంతా టీడీపీ నేతలదే.. జనసేన ఎమ్మెల్యేలు గెలిచిన చోట కూడా టీడీపీ నేతలే హవా సాగిస్తున్నారు. బెల్టు షాపులు మొదలుకొని అక్రమ గ్రావెల్ దందా వరకు, చిన్న స్థాయి నామినేటెడ్ పదవులు మొదలుకొని జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులు, పల్లెల్లో చిన్న సీసీ రోడ్లు మొదలుకొని నియోజకవర్గ స్థాయి పనుల వరకు అన్నింటిలో టీడీపీకి సింహభాగం వాటా ఇవ్వాల్సిందే. లేదంటే జనసేన ఎమ్మెల్యేకు సోషల్ మీడియాలో చుక్కలు చూపిస్తారు.

- ఉంగుటూరులో షాడో ఎమ్మెల్యేగా గన్ని వీరాంజనేయులు
- భీమవరం ఎమ్మెల్యే కార్యాలయంలో షాడోగా టీడీపీ నేతలు
- పనులు, పర్సంటేజీలు, లిక్కర్, గ్రావెల్‌లో టీడీపీదే అగ్రభాగం
- గూడెంలో పట్టుకోసం టీడీపీ పాకులాట
- జనసేన ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి మధ్య మాటల యుద్ధం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమలో భీమవరం, ఉంగుటూరు నియోజకవర్గాల్లో టీడీపీ దెబ్బకు జనసేన ఎమ్మెల్యేలు విలవిల్లాడుతున్నారు. పేరుకు ఎమ్మెల్యే అయినా పెత్తనమంతా టీడీపీ నేతలదే కావడంతో చేసేది లేక సైలెంట్‌గా ఉంటున్నారు.

చెల్లుబాటు కాని ధర్మరాజు మాట

ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అదే నియోజకవర్గంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ఉన్నారు. నియోజకవర్గంలోని ఉంగుటూరు, గణపవరం, నిడమర్రు మండలాలు ధర్మరాజు చూసుకునేలా, భీమడోలు మండలం గన్ని వీరాంజనేయులు చూసుకునేలా గెలుపొందిన అనంతరం మాట్లాడుకున్నారు. కట్‌చేస్తే.. అన్ని మండలాల్లోనూ టీడీపీ కేడర్ ఎమ్మెల్యేను ఉక్కిరిబిక్కిరి చేయడంతో పాటు పనుల్లో పర్సంటేజీలు తీసుకుంటున్నారు. అవినీతికి పాల్పడ్డారంటూ సోషల్ మీడియా వేదికగా హడావుడి చేయడంలో టీడీపీది కీలక పాత్ర. తాజాగా నియోజకవర్గంలో 50 శాతం పనులు, పదవులు, బెల్టు షాపు ఆదాయాలు, కొల్లేరు అక్రమ సాగు అంతా టీడీపీకి కట్టపెట్టాలని డిమాండ్‌తో దాదాపు సగం సొంతం చేసుకున్నారు. మిగిలిన 50 శాతంలో 40 శాతం జనసేన, 10 శాతం బీజేపీ తీసుకోవాలని ప్రతిపాదన పెట్టారు. ఉదాహరణకు రూ.11.99 కోట్ల విలువైన స్వయం ఉపాధి పథకం రుణాలు 240 టీడీపీకి ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యేకు అల్టిమేటం ఇచ్చారు. నియోజకవర్గంలో 17 సొసైటీలు ఉంటే, 9 సొసైటీలు టీడీపీ తీసుకుని, 7 జనసేనకు, ఒకటి బీజేపీ పంచుకోవాలని టీడీపీ నేతలే తీర్మానం చేశారు. జనసేన కోసం పనిచేసిన కేడర్ ఎమ్మెల్యే కార్యాలయానికి పనుల కోసం వచ్చినప్పటికీ ఏమీ చేయలేని పరిస్థితి. ఏం చేయాలన్నా టీడీపీతో సంప్రదింపులు అనివార్యం.

ఒప్పందాలకు పాతర

కూటమి గెలుపొందాక ముఖ్య నేతల మధ్య పదవుల పంపకాల్లో మౌఖిక ఒప్పందాలు జరిగాయి. ఏ పార్టీ ఎమ్మెల్యే ఉన్నచోట ఆ పార్టీకి తొలి ప్రాధాన్యం.. మిగిలిన రెండు పార్టీలకు తదుపరి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. కట్ చేస్తే... జనసేన ఎమ్మెల్యేలకు టీడీపీ చుక్కలు చూపిస్తోంది. ఉంగుటూరులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు షాడో ఎమ్మెల్యేగా కొనసాగుతుండగా, భీమవరంలో ఇద్దరు టీడీపీ నేతలతో మాట్లాడిన తరువాతగాని ఎమ్మెల్యేను కలిసే పరిస్థితి లేదనే చర్చ బలంగా సాగుతుంది. తాడేపల్లిగూడెంలో జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జిల మధ్య ఆధిపత్య పోరులో భాగంగా మాటల యుద్ధం కొనసాగుతోంది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు ఇద్దర్ని పిలిచి సెటిల్‌మెంట్ చేసినప్పటికీ గొడవ సద్దుమణిగినట్లు లేదు.

జనసేన కార్యాలయంలో టీడీపీ హవా

భీమవరం నియోజకవర్గం నుంచి జనసేన ఎమ్మెల్యేగా గెలుపొందిన పులపర్తి రామాంజనేయులు కార్యాలయంలో టీడీపీ నేతలు హవా సాగిస్తున్నారు. ఎమ్మెల్యే కార్యాలయం కేంద్రంగా టీడీపీ నేతలు కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజులు నియోజకవర్గ వ్యవహారాలు చక్కదిద్దుతున్నారు. ఈ ఇద్దరిలో ఎవరో ఒకరిని కలిసిన తరువాతే ఎమ్మెల్యేను కలిసేలా సిస్టం సెట్ చేశారు. కొద్ది రోజులు క్రితం మత్స్యపురి గ్రామానికి చెందిన జనసేన నాయకులు ఎమ్మెల్యేను కలవడానికి వస్తే టీడీపీ నేత నాగేశ్వరరావే మాట్లాడటం, దానిపైన మత్స్యపురి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసి కలవకుండా వెళ్ళిపోయారు. తరువాత ఎమ్మెల్యే సమాచారం తెలుసుకుని పిలిపించుకుని మాట్లాడారు. టీడీపీ నేతకు సంబంధించిన వ్యవహారంలో చెరువు రైతులకు టీడీపీ నేత బకాయి ఉండటంతో సెటిల్‌మెంట్ చేయడంపైన జనసేనలో అసంతృప్తి ఉంది. నియోజకవర్గంలోని మద్యం షాపులు మొదలుకొని అన్ని వ్యవహారాలు జనసేన ఎమ్మెల్యే పేరుతో టీడీపీ నేతలే చక్కదిద్దడం గమనార్హం.

ధాన్యం కొనుగోలులో చిత్తశుద్ధి లేదు

పీవీఎల్ నర్సింహరాజు



చెరుకుమిల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉండి ఇన్‌చార్జి పీవీఎల్

ఆకివీడు: కూటమి ప్రభుత్వం రైతుల్ని నిండా ముంచిందని.. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షానికి తడిసి ముద్దయ్యాయని వైఎస్సార్‌సీపీ ఉండి ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. చెరుకుమిల్లి గ్రామంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులకు ఈ దుస్థితి వచ్చిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతుల కోసం ఒక్క సంచి కూడా కొనుగోలు చేయలేదన్నారు. చిల్లుల సంచులతో ధాన్యాన్ని ఎగుమతులు చేసి మిల్లులకు తోలాల్సి వస్తుందన్నారు. దాళ్వా ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వల్లే రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. నియోజకవర్గంలో రైతులవద్ద 30 శాతం ధాన్యం ఉందన్నారు. కొంత పంటమీద ఉంటే, మరి కొంత కళ్లాల్లో, నెట్లుపైనా ఉందన్నారు. జగన్ ప్రభుత్వంలో రైతుల వద్ద ప్రతి గింజ కొనుగోలు చేశామని చెప్పారు. సంచుల విషయంలో జేసీకి వినతి పత్రం అందజేశామని చెప్పారు. మండల వైసీపీ అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య మాట్లాడుతూ తడిసిన ధాన్యానికి మద్దతు ధర లభించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్, మంతెన సునీల్‌కుమార్ వర్మ, సర్పంచ్ నందమూరి ప్రకాశం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సైదాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సాగునీటి కాలువల ప్రక్షాళనకు శ్రీకారం



మిడ్ లెవల్ కాలువలో తూడు, కర్రనాచును తొలగిస్తున్న ఉపాధి కూలీలు

సాక్షి స్పందన

పెంటపాడు: ఈ నెల 5న సాక్షిలో ప్రచురితమైన 'కళ తప్పిన పంట కాలువలు' వార్తకు అధికారులు స్పందించారు. రాచర్ల నుంచి దర్శిపర్రు వరకు మిడ్‌లెవల్ కాలువలో ఉన్న చెత్త, గుర్రపు డెక్క, కర్ర నాచును తొలగించే పనిని మంగళవారం ఉపాధి కూలీలతో చేయించారు.

సహకార సంఘాలకు కమీషన్ సొమ్ము చెల్లించాలి

భీమవరం: సహకార సంఘాలకు ప్రభుత్వం బకాయి పడ్డ ధాన్యం కొనుగోలు కమిషన్ మొత్తాలను తక్షణం ఖాతాలకు జమ చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సహకార సంఘాల ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నందమూరి సుబ్బారావు మంగళవారం వినతిపత్రం అందచేశారు. కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు సమీక్షకు హాజరైన మంత్రిని కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో సహకార సంఘాల ఇబ్బందులు తెలిపారు.

ప్రశాంతంగా ఏపీ ఈసెట్ పరీక్ష

భీమవరం: భీమవరం ఏపీ ఈసెట్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. డీఎన్నార్ అటానమస్ కళాశాలలో ఉదయం పరీక్షకు 100 మందికి 99 మంది హాజరుకాగా మధ్యాహ్నం 100 మందికి 99 మంది హాజరయ్యారు. డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం పరీక్షకు 110 మందికి 107 మంది, మధ్యాహ్నం పరీక్షకు 100 మందికి 98 మంది విద్యార్థులు హాజరయ్యారు. విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం పరీక్షకు 100 మందికి 99 మంది, మధ్యాహ్నం పరీక్షకు 93 మందికి 92 మంది హాజరయ్యారు.

9 నుంచి గో దానాల స్వీకరణ

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ గోసంరక్షణ శాలలో ఈనెల 9 నుంచి గోవులను దానంగా తీసుకునే ప్రక్రియను పునరుద్ధరిస్తున్నట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. లంపి స్కిన్ వ్యాధి కారణంగా గత కొద్ది నెలల నుంచి గోవులను దానంగా తీసుకోవడం లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఈ వ్యాధి తగ్గడంతో వైద్య నిపుణుల సూచనల మేరకు గోవులను దానంగా తీసుకునే ప్రక్రియను పునః ప్రారంభిస్తున్నట్టు చెప్పారు.

ఐ-సెట్‌కు సర్వం సిద్ధం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐ-సెట్ పరీక్ష బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించడానికి సంబంధిత అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తారు. ఏలూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సెంటర్, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో కేంద్రాలు కేటాయించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి భీమవరంలోని డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల, డీఎన్నార్ అటానమస్ కళాశాల, విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీవిష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్రాలు కేటాయించారు. నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల, తాడేపల్లిగూడెం శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాల, శశి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష జరగనుంది.

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయండి

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కార్యాలయ భవనానికి సంబంధించి హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని, లేదంటే ఎందుకు అమలు చేయడం లేదో రాతపూర్వకంగా తెలియచేయాలని వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు కమిషనర్ ఎ.భానుప్రతాప్‌ను కోరారు. మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్, నియోజకవర్గ సమన్వయకర్తలు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయాలకు నోటీసులు జారీ చేసి గందరగోళం సృష్టించడంతో వైఎస్సార్‌సీపీ హైకోర్టును ఆశ్రయించింది. వాస్తవ పరిస్థితులు, డాక్యుమెంట్లను పరిశీలించి రెండు వారాల్లో సమస్యను పరిష్కరించాలని హైకోర్టు ఆదేశించింది. 9 నెలలు దాటినా అధికారులు స్పందించలేదు.

ధాన్యం దిగుబడి లెక్కల్లో తేడాలు

- 9.25 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడిగా వ్యవసాయ శాఖ అంచనా
- మంత్రి మనోహర్ అంచనా కేవలం 7.50 లక్షల మెట్రిక్ టన్నులే



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

భీమవరం: అకాల వర్షాలకు రైతన్నలు తీవ్రంగా నష్టపోయిన ఉన్న సమయంలో ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తప్పుడు లెక్కలతో రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రస్తుత దాళ్వా సీజన్‌లో 2.20 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా పంట చేతికి వచ్చే సమయంలో వ్యవసాయశాఖ దాదాపు 9.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. దీనిలో సుమారు 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు తమ సొంత ఆహార అవసరాలకు వినియోగించుకున్నా 7.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం కేవలం 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతిచ్చింది. భీమవరం కలెక్టరేట్‌లో మంగళవారం ధాన్యం కొనుగోలుపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం మంత్రి చెప్పిన లెక్కలకు గతంలో వ్యవసాయశాఖ తెలిపిన లెక్కలకు పొంతన లేదు. జిల్లాలో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామని ఇప్పటికే 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. అధికారులు అంచనా 9.25 లక్షల మెట్రిక్ టన్నులకు మంత్రి చెప్పిన 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడికి పొంతనలేదు. ధాన్యం కొనుగోలు చేయలేక చేతులెత్తేసే ప్రక్రియలో భాగంగా మంత్రి లెక్కల్లో తేడాలు చూపించారని రైతుల సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్వాలో యాంటీ బయోటిక్స్ వాడొద్దు

ఉండి: రొయ్యలు, చేపల సాగులో యాంటీ బయోటిక్ మందులు వాడరాదని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. మంగళవారం ఎన్నార్పీ అగ్రహారంలోని మత్స్య పరిశోధన కేంద్రంలో ఆక్వా రైతులకు సాగు పద్ధతులు, నిర్వహణ, నైపుణ్యంపై మంగళవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆక్వాకల్చర్‌లో మంచి యాజమాన్య పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యామ్నాయ జాతుల పెంపకంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఫిషరీస్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, ఎంపెడా అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, సాంకేతిక సంస్థ ప్రతినిధులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని ఆక్వా సాగులో అవలంభించే సాంకేతిక పద్ధతులను గురించి పలు సూచనలు సలహాలను వివరించాలని అన్నారు.అనంతరం రొయ్యలకు మేతను వేసేందుకు వినియోగించే డ్రోన్ టెక్నాలజీని కలెక్టర్ నాగరాణి పరిశీలించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి కేఎస్‌వీ నాగలింగాచార్యులు, ఫిషరీష్ యూనివర్సిటీ శాస్త్రవేత్త సుగుణ, కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.



మత్స్య పరిశోధన కేంద్రంలో డ్రోన్ సాంకేతికను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

దర్యాప్తు వేగంగా పూర్తి చేయాలి

భీమవరం: త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి, నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చేయడానికి దర్యాప్తు అధికారులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సూచించారు. భీమవరంలో పోలీసు అధికారులకు ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. నార్కోటిక్స్, మత్తు పదార్థాలు, వివిధ రకాల ప్రాణాంతకమైన విషాలు, డీఎన్ఏ, రక్త నమూనాలు, మానవ అవయవాలకు సంబంధించిన సాక్ష్యాల సేకరణ, సైబర్ నేరాలలో పాటించవలసిన అంశాలు, ఆడియో, వీడియో, ముఖ్యమైన పత్రాల సేకరణలో పాటించవలసిన మెలకువల గురించి తెలిపారు. సాక్ష్యాధారాలు ఏ విధంగా భద్రపరచాలి, భద్రపరిచిన వాటిని ల్యాబ్‌కు పంపే సమయంలో ఎలా ప్యాకింగ్ చేయాలి అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) వి. భీమారావు, డీఎస్పీలు ఆర్.జయసూర్య, జి.శ్రీ వేద, డి.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్ సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలి

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవురు

వీరవాసరం: రైతుల నుంచి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వీరవాసరం మండలంలోని రాయకుదురు, బొబ్బనపల్లి, మెంటేపూడి తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. రహదారి పక్కన ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులతో మాట్లాడారు. సీజన్‌లో 9 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం పంట దిగుబడి వస్తుందని అంచనా వేశారని, ప్రస్తుతం 6 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే అనుమతులు ఇచ్చారని, మిగిలిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో రైతుల నుంచి కొనుగోలు చేయాలని కోరారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని తేమ శాతం బట్టి కాకుండా కొనుగోలు చేయాలని కోరారు. దళారీ వ్యవస్థను లేకుండా ప్రభుత్వం తీసుకోవాలన్నారు. పంట నష్టం వల్ల కౌలు రైతు ఆర్థికంగా నష్టపోతున్నాడని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క గింజ కూడా మిగలకుండా ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసిందని గుర్తు చేశారు.

ప్రతి గింజా కొంటాం

సివిల్ సప్లయిస్ ఎండీ మన్‌జీర్ జిలానీ

పెంటపాడు: రాష్ట్రంలో అకాల వర్షం వల్ల తడిసిన ప్రతి గింజను సివిల్ సప్లయిస్ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడవద్దని పౌరసరఫరాల సంస్థ ఎండీ డాక్టర్ మన్‌జీర్ జిలానీ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పెంటపాడు మండలంలోని దర్శిపర్రు రైతు సేవాకేంద్రాన్ని సందర్శించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి. శివరామ్ ప్రసాద్‌లతో కలిసి పలు రైస్‌మిల్లుల్లో గోనె సంచులు తనిఖీ చేశారు. అనంతరం దర్శిపర్రు ఆర్బీకే వద్ద జిలానీ మాట్లాడుతూ.. రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఫోన్ నెంబర్ ఏర్పాటు చేశామన్నారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా రైతులకు తప్పక గిట్టుబాటు ధర దక్కుతుందన్నారు. అకాల వర్షం వల్ల పెద్దగా నష్టం జరగకపోయినా తడిచిన ధాన్యం కొనుగోలుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇంతవరకూ ఎంత ధాన్యం కొన్నారో, సంచుల కొరత తదితర వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆర్డీవో కౌసర్ బానో, వ్యవసాయాధికారి కె.పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



దర్శిపర్రు ఆర్బీకే కేంద్రంలో గోనె సంచులు పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ ఎండీ మన్‌జీర్ జిలానీ

కదం తొక్కిన సీహెచ్‌ఓలు



సమ్మెలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌ఓలు

ఏలూరు (టూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న సీహెచ్‌ఓలు మంగళవారం ఏలూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తమకు ఉద్యోగ, ఆర్థిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ నుంచి గిరిజన భవన్, కొత్త బస్టాండ్, జిల్లా పరిషత్ సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్, డీఈఓ కార్యాలయం, ఎస్‌బీఐ సెంటర్ మీదుగా తిరిగి కలెక్టరేట్‌కు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సీహెచ్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు జర్ కుర్లెళ్ల సురేంద్ర, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సొంగా సిద్దయ్య మాట్లాడుతూ ఆరేళ్లుగా సీహెచ్‌ఓలుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ, ఆర్థిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్‌లో ప్రభుత్వ వాటాను జమ చేయాలని, అదనపు పనిభారం తగ్గించాలని కోరారు. ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించేంతవరకు సమ్మె కొనసాగించనున్నట్లు స్పష్టం చేశారు.

బుధవారం డీడీఆర్‌సీ సమావేశం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు భీమవరం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సమావేశంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

పేదల ఇళ్ల కూల్చివేత ఆపాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

భీమవరం: ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లు దౌర్జన్యంగా కూల్చడాన్ని తక్షణం విరమించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో భీమవరం పాత బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పి-ఫోర్ పేరుతో పేదరిక నిర్మూలన అంటుంటే.. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు పేదలను నిర్మూలించే చర్యలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ స్పీకర్‌గా గౌరవ స్థానంలో ఉన్న రఘురామకృష్ణరాజు పేదల ఇళ్లు కూలుస్తామని బహిరంగంగా ప్రకటిస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఉండిలో రఘురామకృష్ణరాజే కోర్టు, పోలీసు, అధికారిగా వ్యవహరిస్తుంటే అధికారులు ఎమ్మెల్యేకి శిరస్సు వంచుతున్నారన్నారు. కూల్చిన పేదల ఇళ్లు తిరిగి నిర్మించి ఇవ్వాలని, పేదల ఇళ్ల కూల్చివేతను ఆపితే ఇది ముగింపు సభ.. లేకుంటే ప్రారంభ సభగా మారుతుందని శ్రీనివాసరావు ఈ సందర్భంగా హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ మాట్లాడుతూ రఘురామ కృష్ణరాజు గద్దెనెక్కిన రోజు నుంచి పేదల ఇళ్లను కూల్చే కార్యక్రమం చేపట్టారని విమర్శించారు. సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరాం, జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రత్నరాజు, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్, పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్య వర ప్రసాద్, ఏపీ బహుజన జేఏసీ చైర్మన్ తాళ్లూరి మధు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజు, కోనా జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

క్లుప్తంగా

మద్ది క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


మద్ది క్షేత్రంలో బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆంజనేయస్వామి వారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు జరిపారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు బారులుదీరి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు 108 ప్రదక్షణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానమునకు వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,94,262 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సుమారు 1500 మంది భక్తులకు నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాద వితరణ చేసినట్లు చెప్పారు.

సబ్సిడీ విత్తనాల సీజ్


సీజ్ చేసిన విత్తనాల వాహనంతో అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు బైపాస్ రోడ్డులో మంగళవారం విజిలెన్సు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఎటువంటి బిల్లులు లేకుండా వ్యాన్‌లో తరలిస్తున్న 43.60 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను గుర్తించి వ్యాన్‌తో సహా సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పీ శివరామకృష్ణ తెలిపారు. సబ్సిడీ విత్తనాలు బాపట్ల నుంచి కిర్లంపూడి రవాణా చేస్తున్నట్లు తెలిసిందన్నారు. వీటి విలువ రు.4,80,280 ఉంటుందన్నారు. ఈ కేసుకు సంబంధించి కల్లపురెడ్డి వీరరాఘవ అలియాస్ నాని, కల్లపురెడ్డి జయిశ్వర రావులపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ తనిఖీలో విజిలెన్సు ఏఓ జీ. మీరయ్య, పెదవేగి మండల వ్యవసాయ శాఖాధికారి ప్రియాంక, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారని తెలిపారు.

యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: నమ్మించి మోసగించిన యువకుడిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాల ప్రకారం.. తన సోదరి విద్యాభ్యాసం నిమిత్తం జంగారెడ్డిగూడెం రాజుల కాలనీలో తల్లితో కలిసి ఓ యువతి అద్దెకు ఉంటోంది. ఈ క్రమంలో స్థానిక బాలాజీనగర్‌కు చెందిన ఊసా ప్రశాంత్ కుమార్ పరిచయం అయ్యాడు. 2023 నవంబర్ 16న యువతి పుట్టిన రోజు సందర్భంగా ఆమెను స్థానిక శేషాద్రి నగర్‌లోని ఓ బిల్డింగ్ వద్దకు తీసుకువెళ్లి యువతి మెడలో పసుపుతాడు కట్టి, లైంగిక దాడి చేశాడు. కొన్ని రోజుల తరువాత వివిధ కారణాలు చెప్పి ఆమె నుంచి ఒకసారి 3 ఉంగరాలు, 1 బ్రాస్‌లెట్, మరోసారి 2 గాజులు, చెవి జూలార్లు తీసుకున్నాడని యువతి ఫిర్యాదుతో పేర్కొంది. ఈ క్రమంలో యువతి గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించుకోకపోతే చంపుతానని ప్రశాంత్‌కుమార్ బెదిరిస్తున్నాడని, దీనికి మరికొందరు సహకరిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.

శ్రీవారి క్షేత్రం.. శోభాయమానం


విద్యుత్ కాంతులీనుతున్న శ్రీవారి ఆలయం

చినవెంకన్న వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలకు ద్వారకాతిరుమల క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. బుధవారం నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు ఈనెల 14తో ముగియనున్నాయి. ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ రాజగోపురాల సముదాయం, అనివెట్టి మండపం, జంటగోపురాల ప్రాంతం విద్యుద్దీప కాంతులతో మిరమిట్లు గొలుపుతున్నాయి. అలాగే ఆలయ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన స్వామివారి భారీ విద్యుత్ కటౌట్, కొండపైన స్వాగత ద్వారం చూపరులను ఆకట్టుకుంటున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదికను సుందరీకరించారు. – ద్వారకాతిరుమల


విద్యుద్దీప అలంకారాల్లో అనివేటి మండపం


ఆలయ ప్రధాన కూడలిలో స్వామి, అమ్మవార్ల భారీ విద్యుత్ కటౌట్

సీహెచ్‌ఓలకు వైఎస్సార్‌సీపీ సంఘీభావం


సీహెచ్‌ఓలకు సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఏలూరు (టూటౌన్): సీహెచ్‌ఓల న్యాయమైన కోర్కెలను తక్షణం పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన కొనసాగిస్తున్న సీహెచ్‌ఓల శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ మంగళవారం సందర్శించి సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ సీహెచ్‌ఓల సమస్యలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వారి డిమాండ్లన్నీ న్యాయబద్ధమైనవేనని, తక్షణం స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీహెచ్‌ఓల సమస్యను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కారుమూరి సునీల్ కుమార్, పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జు వాసుబాబు, జేపీ, కంభం విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

చెట్టున్నపాడు చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్

భీమడోలు: చెట్టున్నపాడు గ్రామంలో జరిగిన చోరీ కేసులో మంగళవారం ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. గ్రామంలోని పాస్టర్ కొండపల్లి మధుబాబు ఇంట్లో ఈనెల 2వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసి రూ.1.7లక్షల విలువ గల బంగారు ఆభరణాలు, కొంత నగదును చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులు గ్రామానికి చెందిన నేతల రామలింగం, కొత్తపల్లి రత్నాకర్‌లను పట్టుకుని వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను భీమడోలు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

రెండు నెలలుగా జీతాలు అందక విలవిల

ట్రిపుల్ ఐటీల్లోని కాంట్రాక్టు బోధనా సిబ్బంది దుస్థితి



నూజివీడు ట్రిపుల్ ఐటీ

నూజివీడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తాం.. ఇదీ ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పిన మాటలు. కానీ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. రెండు నెలలుగా జీతాలు లేక నాలుగు ట్రిపుల్ ఐటీల్లోని కాంట్రాక్టు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో పనిచేస్తున్న దాదాపు 750 మంది కాంట్రాక్టు బోధనా సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు లేవు. మార్చి నెలకు చెందిన వేతనాలు, ఏప్రిల్‌కు సంబంధించిన వేతనాలు ఆరో తేదీ గడిచినప్పటికీ రాకపోవడంతో సిబ్బంది ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. దీంతో కుటుంబ ఖర్చులకు, ఇతర అవసరాలకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. మరోపక్క ఆ అప్పులపై వడ్డీల భారం అదనమని వారు వాపోతున్నారు. సకాలంలో జీతాలు ఇస్తే ఈ తలనొప్పి ఉండదని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

అవుట్‌సోర్సింగ్ సిబ్బందికే ఇవ్వలేదు

నాలుగు ట్రిపుల్ ఐటీల్లో కాంట్రాక్టు పద్ధతిలో మెంటార్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, గెస్ట్ ఫ్యాకల్టీలు, ల్యాబ్ అసిస్టెంట్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఐటీ మెంటార్లు పనిచేస్తున్నారు. పర్మినెంట్ ఫ్యాకల్టీకి జీతాలు రాగా, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి మాత్రం గత నెల, ఈ నెలలో ఇప్పటివరకు జీతాలు ఇవ్వకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం వల్ల ఆసుపత్రి ఖర్చులు, పిల్లల ఫీజుల చెల్లింపు, నెలవారీ మందుల ఖర్చులు, పాల బిల్లులు, సరకుల బిల్లులు, రుణ ఇన్‌స్టాల్‌మెంట్లు చెల్లింపులు చేయలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

నేడో రేపో జమ అవుతాయి

కాంట్రాక్టు సిబ్బంది వేతనాలు నేడో, రేపో జమవుతాయి. జీతాల బిల్లులను అప్‌లోడ్ చేశాం. ప్రాసెస్‌లో ఉన్నాయి. పర్మినెంట్ ఉద్యోగులకు మూడు రోజుల క్రితమే వేతనాలను ప్రభుత్వం విడుదల చేసింది. పర్మినెంట్, కాంట్రాక్టు సిబ్బందికి హెడ్‌లను వేరువేరుగా పెట్టడంతో జాప్యం జరిగింది. ప్రతినెలా సకాలంలోనే జీతాలను ప్రభుత్వం విడుదల చేస్తోంది. – సంధ్ర అమరేంద్రకుమార్, ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్

జీతాలు నెలకు రూ.3 కోట్లు

నాలుగు ట్రిపుల్ ఐటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు నెలకు రూ.3 కోట్లు జీతాల కింద చెలిస్తారు. రెండు నెలలకు కలిపి రూ.6 కోట్లు చెల్లించాల్సి ఉంది. రెండు నెలలుగా సకాలంలో చెల్లించకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలోనే బడ్జెట్ మంజూరైందని స్థానిక ట్రిపుల్ ఐటీ అధికారులు చెబుతుండగా, ఇంతవరకు ఎందుకు జీతాలు రాలేదని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

రెండు బైక్‌ల ఢీ.. ఒకరి మృతి


ఘటనా స్థలంలో జమాల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చిరంజీవి

ముసునూరు: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన కాట్రేనిపాడు – చిల్లబోయినపల్లి రహదారిలో చోటుచేసుకుంది. ఎస్సై ఎం చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. తాపీ పని పురమాయించుకునేందుకు శనివారపుపేటకు చెందిన బయ్యారపు జమాల్(39), మణికంఠ బైక్ మీద కాట్రేనిపాడు వైపునకు వస్తుండగా ఎదురుగా వస్తున్న నూజివీడు మండలం అన్నవరంకు చెందిన వ్యక్తి మోటార్‌సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బయ్యారపు జమాల్ అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఏలూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏలూరు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నాలుగు నెలల తరువాత తల్లి చెంతకు..


పాతూరుకు చెందిన మానసిక వికలాంగుడిని తల్లి చెంతకు చేర్చిన పోలీసులు

భీమడోలు: మతిస్థిమితం లేక ఇంటి నుంచి వెళ్లిపోయిన మానసిక వికలాంగున్ని పోలీసులు నాలుగు నెలల అనంతరం పట్టుకుని తన తల్లి చెంతకు చేర్చిన ఉదంతమిది. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరుకు చెందిన కొప్పుశెట్టి వెంకన్న(36) మానసిక వికలాంగుడు. అతడిని తల్లి గంగమ్మ కంటికి రెప్పలా కాస్తోంది. అయితే జనవరి 7వ తేదీన మతిస్థిమితం లేక ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకన్న ముంబైకి వెళ్లిపోయాడు. దిక్కుతోచని స్థితిలో గంగమ్మ తన కుమారుడు వెంకన్న ఆచూకీ కోసం జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణంను సంప్రదించంచగా ఆయన సహకారంతో భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై వై.సుధాకర్ వెంకన్న ఆచూకీ కోసం తనదైన శైలిలో కృషి చేశారు. రాష్ట్రంలోని దివ్యాంగుల గ్రూపులో ఫొటోను ఉంచి ఆచూకీ తెలిస్తే తెలియజేయాలని కోరారు. కొన్ని రోజుల తర్వాత ముంబైలోని శరభ ఫౌండేషన్ వారు ముంబై రోడ్లపై తిరుగుతున్న వెంకన్నను పట్టుకుని ఆతనికి వైద్యం చేయించి మందులు అందించారు. కోలుకున్న తర్వాత వెంకన్న శరభ ఫౌండేషన్ వారికి తన అడ్రస్ చెప్పాడు. దీంతో వారు భీమడోలు పోలీసులకు సమచారం అందించారు. మంగళవారం భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో తల్లి గంగమ్మకు వెంకన్నను అప్పగించారు.

ఎద్దుల అక్రమ రవాణా.. అడ్డుకున్న పోలీసులు


కంటైనర్‌లో ఉన్న ఎద్దులు

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లి జాతీయ రహదారిపై ఎద్దుల అక్రమ రవాణాను పోలీసులు మంగళవారం అడ్డుకుని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలు ప్రకారం. పార్వతీపురం మార్కెట్ నుంచి ఒక కంటైనర్‌లో 48 ఎద్దులను తమిళనాడులోని పోలచ్చి మార్కెట్‌కు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలం వద్ద కాపు కాసి, కంటైనర్‌ను అదుపులోకి తీసుకుని డ్రైవర్ మురుగానందంను అరెస్టు చేసి, వివరాలు రాబట్టారు. పట్టుబడ్డ కంటైనర్‌లో తరచూ ఆవులు, గేదెలను రవాణా చేస్తామని, ప్రస్తుతం పట్టుబడ్డ ఈ ఎద్దులను విజయనగరం జిల్లా, పెద్ద మానాపురం గ్రామానికి చెందిన రాజనా రామారావు సూచనల మేరకు పోలచ్చి మార్కెట్‌కు తీసుకెళ్తున్నట్టు చెప్పాడు. అక్కడ కుంకుమరాజు అనే వ్యక్తికి ఫోన్ చేసి ఈ ఎద్దులను అప్పగించాల్సి ఉందన్నారు. ఇంతలో ఇక్కడ పట్టుబడినట్టు తెలిపాడు. దాంతో మురుగానందంతో పాటు, తమిళనాడులోని వట్టం సత్రం గ్రామానికి చెందిన కంటైనర్ యజమాని దండపాణి వెంకటాచలం, రాజనా రామారావు లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. ఎద్దులను నున్న గ్రామంలోని గోసంరక్షణ కేంద్రానికి తరలించినట్టు చెప్పారు.

ప్రశాంతంగా ఏపీ ఈసెట్


ఏపీ ఈసెట్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సుల్లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశించడానికి అవకాశం కల్పించే ఏపీ ఈసెట్ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మంగళవారం ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 2,345 మంది విద్యార్థులకు గాను 2,306 మంది హాజరయ్యారు.

చెల్లని చెక్కు కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా

నూజివీడు: చెల్లని చెక్కు కేసులకు సంబంధించి ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పట్టణానికి చెందిన పడిశాల హరీష్ 2019 డిసెంబరు 29న దయాసాగర్‌కు రూ.5 లక్షలు అప్పుగా ఇచ్చారు. కొంతకాలం తరువాత బాకీ చెల్లింపు నిమిత్తం దయాసాగర్ హరీష్‌కు రూ.5 లక్షలకు చెక్ ఇచ్చాడు. ఆ చెక్‌ను హరీష్ బ్యాంకులో వేయగా సంబంధిత ఖాతాలో నగదు లేదని తిప్పి పంపారు. దీంతో హరీష్ కేసు వేయగా విచారణ అనంతరం దయాసాగర్‌కు ఆరు నెలల జైలుశిక్ష, రూ. 7 లక్షల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. అలాగే మరో కేసులో పట్టణానికి చెందిన బెజవాడ రామారావు 2016 అక్టోబర్ 16న బొల్లిగర్ల పుల్లారావుకు రూ.2.50 లక్షలు అప్పుగా ఇచ్చారు. కొంతకాలం తరువాత బాకీ చెల్లింపు నిమిత్తం పుల్లారావు రూ.3.60 లక్షలకు చెక్కు ఇవ్వగా ఖాతాలో నగదు లేదని తిప్పి పంపారు. దీంతో రామారావు కేసు వేయగా విచారణ అనంతరం పుల్లారావుకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.4 లక్షల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ముగ్గురికి గాయాలు

ద్వారకాతిరుమల: స్థానిక సొసైటీ పెట్రోల్ బంకు వద్ద మంగళవారం బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. తిరుమలంపాలెంకు చెందిన మిడతా నాగ సత్యన్నారాయణ బైక్‌లో పెట్రోలు కొట్టించుకునేందుకు వెళుతూ సొసైటీ బంకు వద్ద రోడ్డు దాటుతుండగా లక్ష్మీపురంలోని తమ పెట్రోల్ బంకు (భీమడోలు వైపు) నుంచి ఓం ప్రకాష్ చౌదరి వెళుతున్న కారు ఢీకొంది. నాగ సత్యన్నారాయణకు తీవ్ర గాయాలుకాగా. కారులోని ఓం ప్రకాష్ చౌదరికి, ఆయన భార్య శ్రావణికి సైతం గాయాల య్యాయి. క్షతగాత్రులను విజయవాడ తరలించారు.

12వ వేతన సవరణ కమిషన్‌ను తక్షణమే నియమించాలి


జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లకు 12వ వేతన సవరణకు సంబంధించిన కమిషన్‌ను తక్షణమే నియమించాలని, అప్పటివరకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) 1938 రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం ఏపీటీఎఫ్ 1938 జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఈ రామ్మోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గుగ్గులోతు కృష్ణ మాట్లాడుతూ 11వ వేతన సవరణ కమిషన్ గడువు ముగిసి రెండేళ్లు పూర్తయినా ఇప్పటివరకు 12వ వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడం సరైన విధానం కాదన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలతో పాటు దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న అన్ని రకాల ఆర్థిక బకాయిలను ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు, మైనర్ మాధ్యమాలను కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్ విధానంతో కూడిన మాన్యువల్ పద్ధతిలో బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను కోరారు. 40 మంది విద్యార్థులు దాటితే రెండో సెక్షన్‌ను ప్రకటించాలని 6, 7, 8 తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు స్కూల్ అసిస్టెంట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జీ మోహన్, ఉపాధ్యక్షుడు డీ శ్రీనివాసరావు, కార్యదర్శులు జీ వెంకటరమణ, పీ ఉమామహేశ్వరరావు, పీ నాగరాజు, గుంటూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంచిలి వద్ద ఇసుక లారీ బీభత్సం

వ్యక్తికి గాయాలు.. ధ్వంసమైన విద్యుత్ స్తంభాలు


లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాలను ఢీకొట్టి పంటబోదెలోకి దూసుకెళ్లిన దృశ్యం


ప్రమాదంలో గాయపడిన కుమార్ జోషిబాబు

అత్తిలి: మంచిలి గ్రామంలో ఓ ఇసుక లారీ అదుపు తప్పి బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ఓ మోటార్‌సైక్లిస్టు తీవ్రంగా గాయపడగా, రెండు విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. వివరాల ప్రకారం.. అత్తిలి మండలం కంచుమర్రు గ్రామానికి చెందిన కోరుకొల్లు కుమార్‌జోషిబాబు మంచిలి గ్రామంలో తాగునీటిని తీసుకువచ్చేందుకు యాక్టివా బండిపై వస్తున్నాడు. మంచిలి వంతెన వద్దకు వచ్చే సరికి భీమవరం నుంచి పెండ్యాల వైపు వెళుతున్న ఇసుక లారీ అదుపు తప్పి యాక్టివా బండిని వెనుకనుంచి ఢీకొట్టి, కొద్దిదూరం వెళ్లి రోడ్డుమార్జిన్‌లో ఉన్న రెండు విద్యుత్ స్తంభాలపైకి దూసుకెళ్లి పంటబోదెలోకి దిగబడింది. దీంతో విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్‌వైర్లు ఒకటికొకటి తాకడంతో ట్రిప్‌అయి విద్యుత్ సరఫరా నిలిచి డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. ఘటన జరిగిన ప్రదేశంలో ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద స్థలానికి పోలీసులు చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విద్యుత్ అధికారులు వచ్చి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. గాయపడిన మోటార్‌సైక్లిస్టు కోరుకొల్లు కుమార్‌జోషిబాబును అత్తిలి ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు తన కారులో తణుకు ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

క్లుప్తంగా

ఆశా డే రివ్యూ మీటింగ్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీరాజ్, వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: తణుకు ఎన్జీవో కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో 'ఆశా' డే రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని సమీక్షించారు. అనంతరం సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు దోమకాటు వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఆశాలు విధిగా ఫ్రైడే డ్రైడే నిర్వహించాలన్నారు. అంకిత భావంతో విధులను నిర్వర్తించడం ద్వారా మాత్రమే సత్ఫలితాలు సాధ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రెటరీలు, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శామ్యూల్

అత్తిలి: ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.శామ్యూల్ అన్నారు. అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం, కె.సముద్రపుగట్టు, అత్తిలి గ్రామ సచివాలయాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శామ్యూల్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఐదేళ్ల లోపు పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు, అప్‌డేట్, మార్పులు చేసుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా వేద పరీక్షలు



వలివేటి శ్రీహరి శర్మకు సత్కారం చేస్తున్న నిర్వాహకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉభయ గోదావరి జిల్లాల వేద విద్యార్థులకు వేద పరీక్షలు మంగళవారం పట్టణంలోని శంకర మఠంలో విజయవంతంగా నిర్వహించామని వేమూరి రామం తెలిపారు. పరీక్షాధికారులు గుళ్లపల్లి హర్ష, ఉపాధ్యాయులు బాబ్జీలచే సుమారు 400 మంది వేద విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. పాలకొల్లుకు చెందిన వలివేటి శ్రీహరి శర్మను సువర్ణ సింహతలాటంతో సత్కారం చేశారు. చతుర్వేద సభ నిర్వహించారు. ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు అభినందనలు చెప్పారు.

ప్రశాంతంగా ఈ-సెట్ పరీక్ష



పరీక్షకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో ఈ-సెట్ పరీక్షను విద్యార్థులు మంగళవారం ప్రశాంతంగా రాశారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు కేంద్రాల్లో పరీక్ష రాయగా, గూడెంలోని శశి, వాసవీ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు రాశారు. వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం పరీక్షకు 230 మందికిగాను 225 మంది హాజరయ్యారు. సాయంత్రం పరీక్షకు 150 మందికిగాను 150 మంది హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నాకర్‌రావు, పరీక్షా కేంద్రం చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నరేష్, కో-ఆర్డినేటర్ నటరాజ్, సిస్టం అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు నివాళులు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

తణుకు అర్బన్: స్థానిక బేతేలు రిఫార్మ్ చర్చిలో మంగళవారం దైవ సేవకులు పాస్టర్ జాషువా జూడ్, పాస్టర్ జి.జాషువా, కె.డేవిడ్‌బాబు అధ్యక్షతన తణుకు మండల పాస్టర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనల్లో భాగంగా పెహల్గాం ఉగ్రదాడిలో అసువులు బాసిన భారతీయ కుటుంబాలకు ఆత్మ స్థైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి మృతులకు సంతాపం తెలిపారు. ఓ.మనోజ్, పి.ఐజాక్ బ్రేన్హం, కె.బ్లెస్సింగ్ రాజు, కెఎస్.రాజు, జి.జాయ్, యస్.కృపావరం, కె.జాషువా, బి.ఏసురత్నం పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

- స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర ఎక్కడ
- రోడ్లపైనే చెత్త.. మురుగు నీటితో డ్రెయినేజీలు
- పందుల ఆవాసాలుగా మారిన వైనం
- వేసవిలోనే వైరల్ జ్వరాల ముప్పు



ప్రత్తిపాడు వై.జంక్షన్ ఆలయ సమీపంలో కాలువ రేవు వద్ద అపారిశుద్ధ్యం



రోడ్డు పక్కన ఉన్న డంపింగ్ యార్డు

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో శానిటేషన్ లోపించింది. ఎక్కడ చెత్త అక్కడే అన్నట్లు ప్రతి వీధిలోనూ చెత్త దర్శనమిస్తుంది. విద్యాలయాలు, అంగన్‌వాడీ సెంటర్లు, పంచాయతీల వలన చెత్త దర్శనమిస్తోంది. పలు గ్రామాల్లో ఊరి చివర్లలో రోడ్ల పక్కన వేసిన చెత్త వలన దుర్వాసన వస్తుంది. మరో పక్క డ్రెయినేజీల శుభ్రత లేక దోమలు విపరీతంగా ప్రభలాయి. వేసవిలోనే వైరల్ జ్వరాల ముప్పు ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లో ఆటలమ్మ, పొంగు జ్వరాలు ఉన్నాయి. వీటిని పట్టించుకోవాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు చోద్యం చూస్తున్నారు. బ్లీచింగ్ చల్లడం, దోమల మందు, ఫాగింగ్‌వంటి చర్యలు కానరావడంలేదు. ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర పేరుతో ఒక రోజ అధికారులు, ప్రజా ప్రతినిధులు చెత్తను నిర్మూలించినట్లు హడావుడి చేసే కార్యక్రమాలు మరలా కానరావడం లేదు. కాగా పలు పంచాయతీల్లో వారానికి ఒక సారైనా ఆ చర్యలు కానరావడం లేదు.

కానరాని చెత్త రిక్షా

చెత్తను నిర్మూలించే ప్రత్యేక రిక్షా కానరావడం లేదు. గ్రామాల్లో చెత్తను తరలించే వారు కనిపించడం లేదు. ప్రధానంగా పలు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని, మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. మేజర్ గ్రామాలైన ప్రత్తిపాడు, విప్పర్రు, పెంటపాడు, అలంపురం గ్రామాల్లో ఆ సమస్యలు అధికంగా ఉన్నాయి. కాగా నేడు పలు గ్రామాల్లో రిక్షాలు మూలన పడేసి, ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. అయితే అన్ని వీధుల్లో అవి తిరగక ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది. పైగా చెత్తను డపింగ్ యార్డులకు తరలించకుండా ఊరి శివార్లలో వేస్తున్నారు. ప్రధానంగా కె.పెంటపాడులో పెంటపాడు వెళ్లే దారిలో చెత్త వలన రోడ్డు అధ్వాన్యంగా మారింది. అదే గ్రామంలో లోలెవెల్ కాలువకు ఆనుకొని ఉన్న కాలనీలో మురుగునీరు లాగక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వల్లూరుపల్లి, రాచర్ల, అలంపురం, జట్లపాలెం గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లో తాగునీరు కూడా కలుషితం అవుతుంది. ప్రధానంగా పంట, తాగునీటి కాలువలు ఉన్న గ్రామాల్లో చెత్తను పంచాయతీలకు తరలించకుండా కాలువను డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారు. అలంపురం, ప్రత్తిపాడు, రాచర్ల, వల్లూరుపల్లి, దర్శిపర్రు గ్రామాలతో పాటు, జట్లపాలెం మిడ్ లెవెల్ కాలువ ప్రాంతాలోల కె.పెంటపాడు, బిళ్లగుంట, ప్రాంతాల్లోని కాలువలో చెత్తను వేయడం వలన తాగునీరు కలుషితమవుతుంది. ప్రధానంగా కాలువ కింద ఉన్న గ్రామాల్లో అదే నీటిని చెరువులకు పెట్టుకోవడంతో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. రాచర్ల, వల్లూరుపల్లి గ్రామాల్లో ప్రధానంగా అత్యధికులు కాలువలో చెత్తను వేస్తున్నారు. దీనిని పంచాయతీలు అడ్డుకోవడం లేదు. ఆయా పంచాయతీలు జరిమానా వేస్తామని హెచ్చరిక బోర్డులు పెట్టినా లెక్క చేయడం లేదు. దీంతో ఏం చేయాలో తెలియడం లేదని కార్యదర్శులు, సర్పంచ్‌లు వాపోతున్నారు. తక్షణం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పందుల ఆవాసాలు

కాగా అలంపురం మిడ్‌లెవెల్ కాలువను ఆనుకొని పందుల ఆవాసాలు ఉన్నాయి. ప్రతి నిత్యం వాటిని అక్కడే మేపుతున్నారు. అటుగా వెళ్లే వారు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. సమీపంలోని రైసుమిల్లు ఎదురుగా చెత్తను తరలించడం లేదు. అక్కడే కొట్టి పడేసిన కొబ్బరి బొండాలు ఉన్నాయి. వాటి వలన వైరల్ జ్వరాలు ముప్పు ఉంది. డెంగీ ప్రబలే అవకాశం ఉంది. వేసవి అయినా సరే అక్కడి పంట కాలువ వ్యర్థాలు, కోడి మాంసం దుకాణాలు, మద్యం సిట్టింగ్ బడ్డీల వలన మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్ట పగలే అటుగా వెళ్లలేకపోతున్నారు. సమీపంలో శివాలయం, సాయిబాబా ఆలయం, ప్రభుత్వ పాఠశాల ఉన్నా వాటి పవిత్రతను దెబ్బ తీసే విధంగా సమస్యలు ఉన్నాయి. తక్షణం పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి పోతర్లంక సాయిరాం

తణుకు అర్బన్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి పోతర్లంక సాయిరాం పేర్కొన్నారు. లేబర్ డే వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తణుకు జీవీ మాల్‌లో పని చేస్తున్న కార్మికులకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. పలు కర్మాగారాలు, దుకాణాలు, షోరూంలలో పని చేసే మహిళలు తమ హక్కులకు భంగం కలిగే విధంగాను, పని చేసే చోట వేధింపులు ఎదురైనా మండల న్యాయ సేవల కమిటీ తణుకు కోర్టు ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని స్పష్టం చేశారు. లేబరు ఆఫీసర్ కిరణ్ కుమార్, లక్ష్మణ్‌కుమార్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవాలని దాని కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలని, డిపార్టుమెంట్ అధికారుల ద్వారా కూడా మీ పేర్లు నమోదు చేసుకోవచ్చని వివరించారు. విధుల్లో జరుగరాని ప్రమాదం సంభవించినప్పుడు వచ్చే పరిహారం ద్వారా కుటుంబానికి కొంత ఊరట కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు, తిర్రే సత్యనారాయణ రాజు, అజయ్ కుమార్, జీవీ మాల్ మేనేజరు మణికంఠ, కృష్ణమూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

తణుకు అర్బన్: శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్రం అధ్యక్షుడు పోవూరి దక్షిణామూర్తి అన్నారు. మంగళవారం స్థానిక అమరవీరుల భవనంలో గత వారం రోజులుగా నిర్వహించిన ఉచిత సమ్మర్ క్యాంప్ ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్, మెజీషియన్ బీఎం గోపాల్ రెడ్డి, గణిత ఉపాధ్యాయులు సీహెచ్ రాజు, యోగా శిక్షకులు పి.రామదాసు, డ్రాయింగ్ ఉపాధ్యాయులు సీహెచ్.దుర్గా ప్రసాద్, రిటైర్డు ఆంగ్ల భాష అధ్యాపకులు, సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కోట రామ ప్రసాద్ అందించిన సేవలను కొనియాడారు. విద్యార్థులకు పి.దక్షిణామూర్తి, పీఎల్ నరసింహారావు జ్ఞాపికలను బహూకరించారు. రిటైర్డ్ పోస్ట్ మాస్ట ర్ ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, గురజాడ విద్యానికేతన్ కరస్పాండెంట్ పాతూరి సీతారామయ్య చౌదరి, రిటైర్డ్ ఉపాధ్యాయులు గజ్జరపు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయిని యర్రా రాజ్యలక్ష్మి, ఆకుల శేషు బాబు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెమెంటో అందిస్తున్న దక్షిణామూర్తి, గోపాలరెడ్డి, తదితరులు

విద్యార్థులకు సౌర కుటుంబంపై అవగాహన

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పఠనాశక్తి, అనర్గళంగా మాట్లాడే నైపుణ్యాన్ని, చదివే అలవాటు పెంచేందుకు రిసోర్సు పర్సన్ వి.వీరేంద్ర శిక్షణ ఇచ్చారు. సౌర కుటుంబం, చలనాలు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కె.నర్సింహమూర్తి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు, వై ప్రసాద్, పి.వెంకటేశ్వరరావు, జి.శేషవేంద్రరావు, ఆర్.దానకృష్ణ, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.



గ్రంథాలయంలో విద్యార్థులకు సౌరకుటుంబంపై అవగాహన కల్పిస్తున్న రిసోర్సు పర్సన్

విద్యార్థులకు ఆటల పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ఆసక్తికరంగా జరుగుతుంది. తొమ్మిదో రోజు మంగళవారం రిసోర్స్‌పర్సన్లుగా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే కథలు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. వి.జనార్ధనరావుచే పుస్తక సమీక్ష, రిసోర్స్‌పర్సన్ కోపెల్ల శ్రీనివాస్‌చే దేశ భక్తి గీతాలు వాటిని పాడి చరణాలను విద్యార్థులకు నేర్పించారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

అత్తిలి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్యా బోధన చేస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి ఎంవీఎల్‌కే ప్రసాద్ అన్నారు. మంగళవారం అత్తిలి మండలం మంచిలి గ్రామంలో ఎంపీపీ బాలికల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు చేపట్టిన విద్యార్థుల నమోదు కార్యక్రమంలో ఎంఈవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకువెళ్లి నమోదు కార్యక్రమం చేపట్టారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందం విలువలతో కూడిన నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నారన్నారు. ప్రతి పాఠశాలలో కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ఆధునిక వసతి సదుపాయాలు కలిగి ఉన్నాయన్నారు. అత్తిలి మండలంలో 57 పాఠశాలల్లో 3129 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారన్నారు. ప్రతి పాఠశాల ఉపాధ్యాయులు విధిగా ఆయా గ్రామాల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఎక్కువ మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేయాలని ఎంఈవో ప్రసాద్ కోరారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో ప్రసాద్

● మత్తులో ముంచేస్తున్నారు



మండల కార్యాలయానికి వెళ్లే దారిలో పెంటపాడు వద్ద అపస్మారక స్థితిలో ఉన్న వ్యవసాయ కూలీ



ప్రత్తిపాడు వై.జంక్షన్ దుర్గమ్మ ఆలయం వద్ద ఎండలో జట్టు కార్మికుడు ఇలా యోగ నిద్ర

కూటమి ప్రభుత్వం ఇష్టానుసారంగా నడుపుతున్న మద్యం దుకాణాల ధాటికి సామాన్యులు, పేదలు బలవుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా బెల్ట్‌షాపులు, దుకాణాలు టార్గెట్‌ల పేరుతో అమ్ముతున్న మద్యం వలన పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. సంపాదించిన సొమ్ము ఇంటికి వెళ్లకుండా ఇలా తాగి రోడ్డున పడుతున్నారు. పెంటపాడు మండలంలో ఒకేసారి ఈ రెండు దృశ్యాలు కనిపించాయి. - పెంటపాడు

ధర్మ చెరువులో పూడిక తీత పనులు



పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో ఎనిమిదెకరాల విస్తీర్ణంలోని ధర్మ చెరువులో పూడిక తీత పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ మర్లపాటి వీరవెంకట సుబ్బలక్ష్మి, కూటమి నాయకులు టెంకాయలు కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ శ్రామికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గ్రామంలో వీలైనంత ఎక్కువ మందికి ఉపాధి పనులు కల్పిస్తామన్నారు. వ్యవసాయ శ్రామికులు వినియోగించుకోవాలని కోరారు. వాడపల్లి సుబ్బరాజు, కొల్లి రాజశేఖర్, మర్లపాటి నాగభూషణం, చీకట్ల శ్యామ్‌సన్, అంగడాల చింతారావు, తదితరులు పాల్గొన్నారు.

29 మంది వృద్ధులకు వైద్య సేవలు



ఉచిత వైద్య సేవలందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్ చంద్రబాబు 29 మంది వృద్ధులకు వైద్యసేవలందించి, వారు తీసుకోవాల్సిన ఆహార నియమాలు తెలిపారు. శిబిరానికి హాజరైన వృద్ధులకు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షులు అడ్డాల సత్యనారాయణ తెలిపారు. తణుకు శాఖ ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాపిరెడ్డి, కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మేడే వారోత్సవాల సందర్భంగా మంగళవారం తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా ఆదేశాల మేరకు శానిటరీ వర్కర్లకు, సెక్రటరీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. శ్రామిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఈ-శ్రమ్ కార్డులను నమోదు చేయించుకోవాలని తెలిపారు. శానిటరీ వర్కర్ల హక్కులు, బాధ్యతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పలు చట్టాలు, వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, హెల్త్ ఆఫీసర్ ఎస్.రాజు, సీనియర్ న్యాయవాది మాకా శ్రీనివాస్‌రావు, ముత్తా రామారావు, రత్నశేఖర్, భద్రుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.



కోర్టులో శ్రామిక చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అదనపు జిల్లా జడ్జి

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఇరగవరం: కూటమి ప్రభుత్వం అలసత్వం, అజాగ్రత్త వలన నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పెన్మెత్స సుబ్బరాజు అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని రైతులు రోడ్డు ప్రక్కన, కల్లాల్లో ఆరబెడుతుండగా పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. మంగళవారం ఇరగవరం మండలంలోని, ఇరగవరం, కొత్తపాడు, అనుమాజిపాలెం, పలు గ్రామల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన సమయంలో రైతుసేవా కేంద్రం, మండల వ్యవసాయ కేంద్రం నుంచి సంచులు వచ్చినట్‌లైతే రైతు పండించిన ధాన్యం రైస్ మిల్లులకు వెళ్లేదని అధికారులు, ప్రభుత్వం అలసత్వం వహించి సంచులు సకాలంలో అందించకపోవడంతో రైస్ మిల్లులకు ధాన్యం సకాలంలో పంపించలేకపోయామని దీంతో వర్షానికి ధాన్యం తడిసిపోయిందని రైతులు వాపోతున్నారన్నారు. కొత్తపాడు గ్రామానికి చెందిన రైతు దొంగ శ్రీను మాట్లాడుతూ సంచుల కోసం కోతలు కోసిన రోజు నుంచి ఈ రోజు వరకు అధికారులు, నాయకుల చుట్టు తిరుగుతున్నామని ఇప్పటి వరకు సంచులు ఇవ్వలేదన్నారు. టీడీపీ నాయకుల దగ్గరకు వెళితే జనసేన నాయకుల దగ్గరకు, జనసేన నాయకుల దగ్గరకు వెళితే టీడీపీ నాయకులు దగ్గరకు పంపిస్తూ వారి చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని అప్పుడు ప్రతి రైతును ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పుడు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులును ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి వెంకట రెడ్డి, మంగిన రామానాయుడు, కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కంకిపాటి శ్రీనివాస్, కుడిపూడి సత్యనారాయణ, కుక్కల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నా రు.



రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

అత్తిలి: ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ కోరారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు అత్తిలి శివారు బొంతువారిపాలెంలో తడిసిన ధాన్యాన్ని వారు పరిశీలించారు. వర్షానికి మొలకలు వచ్చిన ధాన్యాన్ని పలువురు రైతులు వైఎస్సార్‌సీపీ నాయకులకు చూపించారు. ఈ సందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ వర్షానికి ధాన్యం తడవడంతో ధాన్యం రాశుల్లో మొలకలు వచ్చాయని, తేమ శాతం నిబంధన లేకుండా రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. గోనె సంచుల కొరత ఉందని, రైతులు చెబుతున్నారని, పీఆర్ 126 రకాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడంలేదని రైతులు చెబుతున్నారన్నారు. తక్షణమే రైతులు పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

మంచిలి మాజీ సర్పంచ్ మృతి



చింతా బాపిరెడ్డి(ఫైల్)

అత్తిలి: మంచిలి గ్రామ మాజీ సర్పంచ్ చింతా బాపిరెడ్డి(68) అనారోగ్యంతో రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఈయన 2006 నుంచి 2011 వరకు మంచిలి గ్రామ సర్పంచ్‌గా పని చేసి గ్రామాభివృద్ధికి పాటు పడ్డారు. బాపిరెడ్డి ఆకస్మిక మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. చింతాబాపిరెడ్డి మృతికి మండల నాయకులు, అభిమానులు సంతాపం తెలిపారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సబ్ యూనిట్ ఆఫీసర్, వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): కీటక జనిత వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో మంగళవారం వీకర్స్ కాలనీ, బేబి సెంటర్ జంక్షన్, కడకట్ల, యాగర్లపల్లి వైద్యాధికారులు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ వన్యశ్రీ, డాక్టర్ కే.రవికుమార, డాక్టర్ శిరీషలు అధ్యక్షతన ఆశా డేలు నిర్వహించారు. సమావేశాల్లో ఆశాలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ వ్యాధులు రాకుండా క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వెల్లడించారు. ఆశ నోడల్ పర్సన్ మంగతాయరు, పద్మ, పాల్గొన్నారు.

పనిముట్లు అందుబాటులో ఉంచాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పని ప్రాంతంలో పని ముట్లు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించి, శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ శ్రామికులకు సమ్మర్ అలవెన్స్‌లు పునరుద్ధరించాలన్నారు. సంఘ నాయకులు పీలా గాదినాయుడు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'కిశోరి వికాసం'పై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కృష్ణాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి బాలికలకు రుతుక్రమం, లైంగిక విద్యపై అవగాహన కల్పించారు. చిన్న వయస్సు నుంచే బాలికలకు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తద్వారా శారీరక సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఏఎన్ఎం పి.సుభాషిణి, కిశోర బాలికలు పాల్గొన్నారు.